రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభయ హస్త పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలకు పొంతన లేదన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నల్లకుంట: స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నల్లకుంట డివిజన్ పరిధిలోని ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఈ మేళాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు ఇతర నాన్-టెక్నికల్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. సుమారు 4000 మంది హాజరైతే దాదాపు 1500 మందికి పైగా ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారికి మరో రౌండ్ ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో హెచ్‌ఆర్ మేనేజర్లుగా పని చేస్తున్న ఆలూరి చక్రవర్తి, ఎం. చంద్రమౌళీ పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ ఉత్సవాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గ్యార్వీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ నగర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లో రంగానగర్‌లో గల ఆశీర్‌ఖానాలలో గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ఆశీర్ ఖానా దర్గాలో సాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం గ్యార్వీ ఉత్సవాలు హిందూ, ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముప్పిడి నర్సింగ్ రావు, గోరేభాయ్, ఆసీఫ్, లడ్డూ, రహమత్, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలని వినతి

నల్లకుంట: రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కోసం తమ వంతు సహకారం అందించాలని గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యవర్గం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గంగపుత్రం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీటీ. మల్లయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మధుసూదన్, యశ్వంత్ తదితరులు కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. గంగపుత్రులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. సమస్యలను విన్న కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు తెలిపారు.

స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వడం హర్షణీయం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నేటి యువత స్వయం ఉపాధి వైపు పయనించేందుకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహించడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం సహకారంతో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి లేని యువత పెడదారిన పడుతూ సంఘ విద్రోహులుగా మారే ప్రమాదం ఉందన్నారు. వారి కోసం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. దీంతో ఒక జనరేషన్‌కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ అధినేత కె.ఉపేందర్, కార్పొరేటర్ కె.రవిచారి, అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి, రామచంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహదూర్ యార్ జంగ్‌కు నివాళి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎంఐఎం పార్టీ వ్యవస్థాపకుడు నవాబ్ బహదూర్‌యార్ జంగ్ వర్ధంతి ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని పఠాన్ బస్తీలో నిర్వహించారు. ఈ సందర్భంగా బహదూర్ యార్ జంగ్ సమాధిని ఎంఐఎం పార్టీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యేలు మహ్మద్ ముబీన్, కౌసర్ మోహిఉద్దీన్, మాజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, మాజీ ఎమ్మెల్యేలు పాషా ఖాద్రీ, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పట్టించుకోండి!



బీఎస్ఎన్ఎల్ రోడ్డులో కార్ల పక్కనే మూత్రవిసర్జన



వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

- కాలనీలు, బస్తీల్లో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గాంధీనగర్ డివిజన్‌లో పడకేసిన పారిశుద్ధ్యం

చిక్కడపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పే జీహెచ్‌ఎంసీ, ఉద్యానవన, శానిటేషన్ అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. గత వారం విద్యుత్ అధికారులు, సిబ్బందితో వచ్చి వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించారు. వాటిని అలాగే రోడ్లకు ఇరువైపులా వదిలేశారు. దీంతో గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్, చిక్కడపల్లి తదితర ప్రాంతాలు అధ్వానంగా మారాయి.

◆ వివేక్‌నగర్‌లోని పీపుల్స్ పార్క్‌లో నెల రోజులుగా చెత్తాచెదారం పెరుకుపోయింది. దీంతో పార్కుకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా శ్రీ రేణుకాఎల్లమ్మ, నాగదేవత ఆలయానికి వచ్చే భక్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

◆ జవహర్‌నగర్‌లోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పాతభవనం ప్రస్తుతం దోమలగూడ పోలీస్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ గోడ పక్కన రోడ్డులో చెత్తచెదారం కుప్పలుగా పోసి ఉంది. ఈ రహదారిలో అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.

◆ అటుగా వెళ్లే వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అటు నుంచి వెళ్లాలంటే మహిళలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పకడ్బందీ చర్యలు తీసుకుంటాం



గాంధీనగర్ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని నాకు ఫిర్యాదు అందాయి. జీహెచ్‌ఎంసీ, శానిటేషన్, ఉద్యానవన అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటా. ఈ డివిజన్‌లోనే కాకుండా మొత్తం నియోజకవర్గంలో ఇలాంటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గంలో పచ్చదనం, పరిశుభ్రత కృషి చేస్తా.

– ముఠాగోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

దుర్గంధాన్ని తొలగించండి



వివేక్‌నగర్‌లో చెట్లకొమ్మలు, చెత్తాచెదారం రోడ్లపైనే రోజుల తరబడి ఉంటోంది. దీంతో దోమల వ్యాప్తి పెరిగిపోయింది. దుర్గంధంతో పెరిగిపోవడంతో ఇబ్బందిగా ఉంది. అధికారులు సమన్వయంతో పనిచేసి దుర్గంధాన్ని తొలగించాలి.

– సీహెచ్ వాణీశ్వరశాస్త్రి, రిటైర్డ్ హెచ్‌ఎం

ఫాగింగ్ చేయడం లేదు



వివేక్‌నగర్‌లో దుర్గధం పెరిగిపోవడంతో దోమల బెడద తీవ్రమైంది. ఎంటమాలజీ సిబ్బంది కనీసం ఫాగింగ్ చేయడం లేదు. చీకటి పడిందంటే చాలు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. నిత్యం ఫాగింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– స్రవంతి, స్థానికురాలు

చెత్తాచెదారం తొలగిస్తాం



చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపుతాం. అపరిశుభ్రత వాతావరణం ఉన్న చోట బ్లీచింగ్ వేయిస్తాం. చెత్తాచెదారం పేరుకుపోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– పావని, గాంధీనగర్ కార్పొరేటర్



త్యాగరాయ గానసభ నుంచి సుధాహోటల్ వెళ్లే లైన్‌లో ఇలా..



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే చెత్తాచెదారం

ప్రతి జీవిలోనూ శివుడు ఉన్నాడు



మాట్లాడుతున్న బనారస్ రామకృష్ణ అద్వైతి ఆశ్రమ అధ్యక్షుడు స్వామి విశ్వాత్మానంద

కవాడిగూడ: ప్రతి జీవిలోనూ శివుడు ఉన్నాడని భావిస్తూ సేవ చేయాలని బనారస్ రామకృష్ణ అద్వైతి ఆశ్రమ అధ్యక్షుడు స్వామి విశ్వాత్మానంద అన్నారు. సేవతో వ్యక్తిగతంగాను సామాజికంగాను దివ్యాత్వాన్ని సాధించేలా రామకృష్ణ మఠం మిషన్ సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆదివారం రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వాత్మానంద, హెచ్ఆర్‌కె పాసిటీ బిల్డింగ్ కమిషన్ సభ్యుడు డా. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... సేవ ఎలా చేయాలో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివేకానంద ఆరోగ్య కేంద్రాన్ని చూస్తే కచ్చితంగా తెలుస్తుందన్నారు. హైదరాబాద్ రామకృష్ణ మఠంలో కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి జ్ఞానదానంద, ఆరోగ్య భారతి వ్యవస్థాపకుడు డాక్టర్ సురేందర్‌రెడ్డి, ఆర్య జనని ఇన్‌చార్జి డాక్టర్ అనుపమరెడ్డితో పాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుల గొంతుకగా డిజిటల్ మీడియా



సమావేశంలో మాడభూసి శ్రీధర్, గాలివినోద్ కుమార్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "ప్రజా ప్రభుత్వం, ప్రజాస్వామ్యం – డిజిటల్ మీడియా"అనే అంశంపై ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాడభూసి శ్రీధర్, ప్రొ. గాలి వినోద్‌కుమార్, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి హాజరై మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో డిజిటల్ మీడియా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తోందన్నారు. అనగారిన ప్రజల గొంతుకగా నిలుస్తూ ముందుకు సాగుతోందన్నారు. డిజిటల్ మీడియాలో మరిన్ని విలువలను పాటించాలని సూచించారు. డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించి డిజిటల్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, బొడ్డు అశోక్, దేశాయి కరుణాకర్‌రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, ప్రొ. జానకీరెడ్డి వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సునీల్ బిడ్లాన్, నాగేందర్ బాబ్జీ

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. కాలనీలు, బస్తీల్లో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాచిగూడ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నేతలు నాగేందర్ బాబ్జీ, సునీల్ బిడ్లాన్, బబ్లూసింగ్, అంథోని తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

బీజేపీ నేత శీర్‌సాగర్‌కు మాతృవియోగం



నీలమ్మ (ఫైల్)

కాచిగూడ: బీజేపీ దళిత మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి శీర్‌సాగర్ తల్లి నీలమ్మ (92) ఆదివారం మృతిచెందారు. ఆదివారం చెప్పల్‌బజార్‌లో నీలమ్మ పార్థివదేహానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్ ఉమారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, సి.నందకిషోర్ యాదవ్, సుభాష్‌పటేల్, చిట్టి శ్రీధర్, శ్యామ్‌రాజ్, అజయ్‌కుమార్, మహేష్, పంకజ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు వీహెచ్ చేయూత



వీహెచ్‌తో అంబేడ్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట: అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్యాంస్య విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. శ్రీరమణ చౌరస్తాలో ప్రస్తుతం ఉన్న విగ్రహం స్థానంలో నిలువెత్తు అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం విహెచ్ నివాసంలో కలిశారు. విగ్రహ ఏర్పాటు విషయాన్ని అసోసియేషన్ ప్రతినిధులు వీహెచ్‌కు వివరించగా తన సొంత ఖర్చులతో నిలువెత్తు కాంస్య విగ్రహ ఏర్పాటుకు తోడ్పాటును అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.కృష్ణ,కుంకుమ బలరామ్, రావుల బాలరాజు, కుంకుమ శివకుమార్, కుంకుమ నరేందర్, కోటం అనిల్‌కుమార్, శ్రీనివాస్, ధనరాజ్, ప్రేమ్‌కుమార్, కిషన్‌రావులతో పాటు కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీలకు సివిల్స్ శిక్షణ అకాడమీని ఏర్పాటు చేయండి



కాచిగూడ: అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీల అభ్యున్నతికి, విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ యువ చైతన్య పోరాట సమితి డిమాండ్ చేసింది. బీసీ యువత కోసం ఐఏఎస్, ఐపీఎస్ (సివిల్స్) శిక్షణ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు సమితి అధ్యక్షురాలు కె.సంజన, హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డా. కొండ శ్రీనివాస్‌రావు ఆదివారం ఎమ్మెల్సీ ప్రొ. కోదండ రాంను కలిసి వినతి పత్రం అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు సూపర్-100 స్కాలర్‌షిప్

ఉచితంగా ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జలాధార ఎడ్యూకేషనల్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సూపర్-100 స్కాలర్‌షిప్ అందించనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ అర్హత సాధించిన వారికి ఏప్రిల్ 13న లిఖిత పరీక్ష నిర్వహించి ఎంపికైన 100 మంది విద్యార్థులకు ఉచితంగా ఐఐటీ, జేఈఈ, నీట్ ఆన్‌లైన్ కోచింగ్, ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.500 అందిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ నం.73372 85228లో ఈనెల 31వ తేదీలోపు సంప్రదించాలని కోరారు.

రైలులో గోల్డ్ రింగ్, నగదు చోరీ

కాచిగూడ: రైలులో ఓ ప్రయాణికుడి గోల్డ్ రింగ్‌తో పాటు నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని నిజాంపేట ప్రాంతానికి చెందిన అచార్యులు (65) నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు వస్తున్నాడు. బాసర వద్దకు రాగానే బ్యాగులోని గోల్డ్ రింగ్, రూ.9,500నగదు కనిపించలేదు. బ్యాగును, బ్యాగులో ఉన్న సెల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బాత్‌రూమ్‌లో పడేసి వెళ్లిపోయారు. కాచిగూడలో దిగిన వెంటనే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

సన్మానం

చిక్కడపల్లి: రాష్ట్ర కార్మిక శాఖ కనీస వేతనాల సలహా మండలి నూతన డైరెక్టర్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం కంటెస్టెడ్ కార్పొరేటర్ గుర్రం చంద్రకళాశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమానికి తాను కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు గుర్రం శంకర్, కృష్ణయాదవ్, శ్రీనివాస్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణతో అందరికీ న్యాయం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆరెపల్లి రాజేందర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎస్సీ వర్గీకరణతో అందరికీ సమాన న్యాయం జరుగుతుందని మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... భారత అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను జనాభా దామాషా ప్రకారం ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పును ఇచ్చిందని గుర్తు చేశారు. సామాజిక న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మద్దతును ప్రకటించి వెంటనే క్యాబినెట్ సబ్ కమిటీని వేశారన్నారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జీతో ఏకసభ్య కమిషన్ కూడా వేశారని తెలిపారు. వారి నివేదికను తీసుకొని ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వర్గీకరణ వల్ల ఒక మాలమాదిగలకే కాకుండా 59 ఉపకులాలకు లబ్ధి చేకురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి ఎ. భరత్‌భూషణ్, పల్లెల వీరస్వామి, డాక్టర్ చీమ శ్రీనివాస్, సామర్ల కిరణ్, జె. నర్సింగ్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



పార్కులో కుర్చీలు వితరణ చేసిన సత్తయ్య, గోపమ్మలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: కాలనీ సంఘాలు, వ్యాపారులు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ ఎంసీహెచ్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కులో ప్రజల సౌకర్యార్థం దాతలు సత్తయ్య, గోపమ్మ దంపతులు 8సిమెంటు కుర్చీలను వితరణగా అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ దాతలను అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో పార్కులను మరింత మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ఎంసీహెచ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వినీల్ కుమార్, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు ఎయిర్‌టెల్ రాజు, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ అందాల పోటీల్లో శ్రీతేజ విజయం సాధించాలి



మిస్ సౌత్ ఇండియా విజేత శ్రీతేజను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ

ముషీరాబాద్: గంగపుత్ర కాలనీకి చెందిన వంగరి శ్రీతేజ ఢిల్లీలో జరిగిన దక్షిణ భారత అందాల పోటీలో మిస్ సౌత్ ఇండియా-2024 పోటీలలో ప్రైడ్-2024 టైటిల్‌ను దక్కించుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ ఆదివారం శ్రీతేజను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... త్వరలో జరగనున్న ప్రపంచ అందాల పోటీలలో శ్రీతేజ విజయం సాధించాలని ఆకాంక్షించారు. అందుకు తమ వంతుగా సహాయ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్, బీఆర్ఎస్ నాయకులు ఎయిర్‌టెల్‌రాజు, దీన్‌దయాల్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇళ్లు



మాట్లాడుతున్న సత్యనారాయణగౌడ్, మల్లారెడ్డి తదితరులు

కాచిగూడ: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందించే విధంగా కృషి చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నారాయణగూడలో సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, పి.రాజేందర్, వై.రాంచందర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యలను ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్‌గా విభజించి సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ముందుగా నాన్ ఫైనాన్షియల్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సమస్య కూడా నాన్ ఫైనాన్షియల్ లిస్టులో ఉందని తెలిపారు. త్వరలోనే సొసైటీ సభ్యులకు ప్రభుత్వం నుంచి తీపి కబురు అందనుందని పేర్కొన్నారు. సొసైటీకి సంబంధం లేని కొంత మంది బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ సొసైటీ డైరెక్టర్లను వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇది సరికాదన్నారు. ఇళ్ల స్థలాలు చేతికి వచ్చే సమయంలో కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.